## కోనరావుపేట సెస్ ఏఈపై చర్యలు తీసుకోండి

కోనరావుపేట, జూన్ 19: మండల కేంద్రంలోని సెస్ ఏఈ దివ్య పనితీరు బాగులేదని, ఇష్టారీతిన వ్యవహరిస్తూ రైతుల మోటర్ల స్టార్టర్లను తొలగిస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పడుతుందని రైతులకు సమాచారం ఇవ్వకుండానే నేరుగా తమ సిబ్బందితో స్టార్టర్లను తొలగిస్తున్న ఏఈపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వాపోతున్నారు. కోనరావుపేట మండలంలోని కొలనూర్ గ్రామ రైతులు తమ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులకు ట్విట్టర్ ద్వారా విన్నవించారు. రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైతు రాజ్యం అని చెబుతున్న కాంగ్రెస్ సర్కారు రైతుల పాలిట శాపంగా మారి రైతులను వేధిస్తున్నదని వాపోయారు. ఏండ్ల నుంచి నడుస్తున్న కరెంటు మోటర్ల కనెక్షన్లను తొలగిస్తూ తమ లబ్ధికోసం ఇష్టారీతిన వ్యవహరిస్తూ రైతులకు కరెంటు తొలగిస్తున్నారన్నారు. కరెంటు బిల్లును చెల్లిస్తూ వ్యవసాయ సాగు కోసం కరెంటును వాడుతుంటే ఇన్ని రోజులు లేనిది కరెంటు తొలగించడం సరికాదన్నారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న సెస్ ఏఈ దివ్య, హెల్పర్ శ్రావణ్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇక్కడ రైతు ఓరగంటి శంకర్, తదితరులు ఉన్నారు.



డాక్టర్ రవీందర్‌రావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

## డాక్టర్ రవీందర్‌రావుకు తుది వీడ్కోలు

- కోరెంలో అంత్యక్రియలు
- హాజరైన మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రి కొప్పుల

బోయినపల్లి రూరల్, జూన్ 19 : సీనియర్ జనరల్ సర్జన్, ప్రతిమ వైద్య కళాశాల డీఎంఈ చెన్నాడి రవీందర్‌రావు అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామమైన బోయినపల్లి మండలం కోరెంలో నిర్వహించారు. రవీందర్‌రావు బావ ఆయన మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, వినోద దంపతులు, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాధవి దంపతులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతకు ముందు రవీందర్‌రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి నివాళులర్పించారు.

**కోరెంలో విషాదఛాయలు**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వైద్య సేవలతో అందరి మన్ననలు పొందిన చెన్నాడి రవీందర్‌రావు మరణించడంతో ఆయన స్వగ్రామమైన కోరెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎన్నో కుటుంబాలకు నేనున్నానని ధైర్యం చెప్పి ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడని గ్రామ ప్రజలు ఆయన సేవలు కొనియాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. వైద్య పరంగానే కాకుండా సమాజ సేవలో తన వంతు సహాయ సహకారాలు, విరాళాలు అందించారు. కోరెంలో నిరుపేదలు ఇల్లు కట్టుకోవడానికి, ప్రజా అవసరాలకు భూ విరాళం అందజేసి గొప్ప ఔన్నత్యాన్ని చాటుకున్నారు. ఆయన సేవలు మరువలేనివని, అంత మంచి మనిషిని కోల్పోవడం దురదృష్టకరమని ఆయన అభిమానులు, గ్రామ ప్రజలు ఆవేదన చెందారు. అంతిమ యాత్రలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీజేపీ నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, ప్రతాప రామకృష్ణ, ప్రజా ప్రతినిధులు, నాయకులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## మీ వదిన చాలా మంచిది..!

- కన్నీళ్లు తెప్పించిన నవ వరుడు పండరీనాథ్ ఆఖరి వ్యాఖ్యలు
- స్నేహితుడితో ముచ్చటిస్తూనే వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

'మీ వదిన చాలా మంచిది... కందికట్కూరు ఎల్లమ్మ మొక్కులతో సహా కార్యక్రమాలన్నీ చాలా మంచిగా బాగా జరిగాయ'ని స్నేహితుడితో ఆనందాన్ని పంచుకుంటూనే మృతి చెందిన నవ వరుడు పండరీనాథ్ మాట్లాడిన మాటలను తలుచుకుంటూ స్నేహితులు, బంధువులు కన్నీటి పర్యంతం అవుతున్న తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.



పండరీనాథ్ (ఫైల్)

వేములవాడ, జూన్ 19: వేములవాడ పట్టణంలోని సుబ్రహ్మణ్యంనగర్‌కు చెందిన మల్యాల పండరీనాథ్ (25)కు మే 23న బోయినపల్లి మండలంలోని మానువాడకు చెందిన యువతితో వివాహమైంది. వివాహం తర్వాత బుధవారం కందికట్కూరు ఎల్లమ్మ వద్ద అమ్మవారికి కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడ కార్యక్రమ లెక్కలు పూర్తిచేసి సామాను అప్పగించి వస్తానని కుటుంబ సభ్యులందరినీ ముందుగా ఇంటికి సాగనంపారు. అయితే ఆయన వెంట స్నేహితుడు చందు ఉండగా ఇద్దరు కలిసి మొత్తం సరదాగా వాహనం నడుపుకుంటూ వచ్చారు. వెంకట్రావుపల్లి వద్దకు రాగానే చందు దగ్గర నుంచి పండరీనాథ్ వాహనాన్ని తీసుకొని తానే నడుపుతూ సరదాగా స్నేహితుడితో మాట్లాడుతూ వచ్చారు. ఆడపిల్లలు లేని ఇంట్లోకి మీ వదిన చాలా మంచిది వచ్చిందని ఇక జీవితం మొత్తం చాలా హ్యాపీగా ఉంటానని మాట్లాడుకుంటూ వస్తున్నారు. వంతెన దిగి కొంచెం ముందుకు రాగానే ఒక్కసారిగా వాహనం మీదికి వచ్చి ఢీకొట్టిందని స్నేహితుడు చందు తెలిపాడు. దీంతో పండరీనాథ్ అక్కడికక్కడే మృతి చెందగా ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న చందు పక్కన ఎగిరిపడి కుడి కాలు విరిగింది. అయితే కారు నడుపుతున్న కరీంనగర్‌లోని రేకుర్తికి చెందిన చంద్రశేఖర్ కూడా బెలూన్ ఓపెన్ అయ్యి డోర్ బయటకు వచ్చి కింద పడ్డాడు. అప్పటికే అతిగా మద్యం తాగి ఉండడం ఒక్కసారిగా కిందపడడంతో తల నుంచి తీవ్రంగా రక్తస్రావం కాగా స్థానికులు అప్పటికే చేరుకున్న పోలీసులు కరీంనగర్ తరలించారు. సదరు చంద్రశేఖర్ అప్పటికే రుద్రవరం వద్ద ఓ వ్యక్తిని ఢీకొట్టి తప్పించుకునే క్రమంలో వీరిని కూడా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించిందని పోలీసులు చెప్పారు. పండరీనాథ్ ఇటీవలే ఏడాది క్రితం దుబాయ్ దేశం నుంచి రెండో బైపాస్ రహదారిలో ఇటీవలే దుకాణం పెట్టుకున్నాడు. దుకాణం పెట్టుకున్నాక వివాహం చేసుకొని జీవితంలో స్థిర పడదామని ఎంతో ఆశపడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు స్నేహితులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలిరాగా గురువారం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమయాత్రలో వేములవాడ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు, మాజీ కౌన్సిలర్లు సిరిగిరి రామచందర్, జోగిని శంకర్, పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కోయినేని బాలయ్య, మాజీ అధ్యక్షుడు రైకన్నపేట క్రాంతి కుమార్, నాయకులు ఉపేందర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ ఊరికి వచ్చిరాని ఎంపీటీసీ పదవి!

- వరుసగా ముగ్గురు ఎంపీటీసీలు మృత్యువాత
- కుంటయ్య మృతితో చర్చనీయాంశంమైన అంకుసాపూర్ ఎంపీటీసీ స్థానం



కుంటయ్య (ఫైల్)

సిరిసిల్ల రూరల్, జూన్ 19: తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో ఎంపీటీసీ పదవి అచ్చిరావడం లేదు. ఈ గ్రామం నుంచి వరుసగా ముగ్గురు ఎంపీటీసీలుగా పదవులు అనుభవించి, ఏదో ఒక కారణంతో మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఈ గ్రామం నుంచి 2004 లో ఎంపీటీసీగా ఎన్నికైన బొల్లం బక్కయ్య గుండెపోటుతో మృతి చెందాడు. తరువాత తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో అంకుసాపూర్ నుంచి సాడ శంకర్ ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. తరువాత పదవిలో ఉండగానే 2017 లో సాడ శంకర్ ఆత్మహత్య చేసుకున్నాడు. తాజాగా మాజీ ఎంపీటీసీ కుంటయ్య సైతం ఆత్మహత్య చేసుకోవడంతో దీంతో అంకుసాపూర్ వాసులకు ఎంపీటీసీ స్థానం అచ్చిరావడం లేదని చర్చించుకుంటున్నారు. ముగ్గురూ ఎంపీటీసీలుగా గెలుపొంది, ప్రజలకు సేవచేశారు. ముగ్గురికి గ్రామాల్లో మంచి పేరుంది. కానీ ఆర్థిక ఇబ్బందులతోనే మృతి చెందడం గమనార్హం.

## కూలీ పిల్లలను బడిలో చేర్పించిన మాజీ జడ్పీటీసీ



చిన్నారులను వెంకటాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పిస్తున్న లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట, జూన్ 19: మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు తన వ్యవసాయ క్షేత్రంలో పనికి కుదిరిన మహారాష్ట్రకు చెందిన లచ్చన పిల్లలను బడిలో చేర్పించాడు. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మణ్‌రావు స్వగ్రామం హరిదాస్‌నగర్‌లోని వ్యవసాయ క్షేత్రంలో పనిచేసేందుకు మహారాష్ట్రకు చెందిన లచ్చన్న కట్టెలను పనిలో కుదుర్చుకున్నాడు. సదరు వ్యవసాయ కూలీ పిల్లలు అవంతి లచ్చన్న కట్టెల, ఆదర్శ లచ్చన్న కట్టెల తమ తండ్రి వద్ద ఉండేందుకు వచ్చారు. బడులు ప్రారంభమైనవేళ పిల్లలు చదువుకోవాలని లక్ష్మణ్‌రావు ఉపాధ్యాయులతో మాట్లాడారు. వారికి అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసి గురువారం వెంకటాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. బడీడు పిల్లలు బడిలో చేర్పించేందుకు తన వంతు ప్రయత్నం చేశానని వారి చదువుకు సహకారం అందిస్తానని తెలిపారు.

## సదరం శిబిరంపై దివ్యాంగులకు అవగాహన కల్పించాలి

- జడ్జి రాధిక జైస్వాల్




శిబిరంలో దివ్యాంగులకు నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలిస్తున్న జడ్జి రాధిక జైస్వాల్

రాజన్న సిరిసిల్ల, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : సదరం శిబిరంలో దివ్యాంగులు ధ్రువీకరణ పత్రాలు పొందేలా స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ పిలుపు నిచ్చారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న సద రం శిబిరాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. సిరిసిల్ల ప్రధాన దవాఖానలో గురువారం నిర్వహించిన సదరం శిబిరాన్ని జడ్జి సందర్శించారు. దివ్యాంగుల గుర్తింపు పరీక్షల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ, చాలా మంది దివ్యాంగులకు సదరం శిబిరాలపై అవగాహన లేకపోవడంతో సరైన ధ్రువీకరణ పత్రాలు పొందలేక పోతున్నారన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు దివ్యాంగులు ధ్రువీకరణ పత్రా లు పొందేలా, వారికి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వలంటీర్లను నియమించినట్లు తెలిపారు. వలంటీర్లతో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇంటికి వెళ్లి దివ్యాంగుల వివరాలు సేకరిస్తున్నారని చెప్పారు. వలంటీర్లతో పాటు జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు ఈ సర్వేలో భాగస్వాములు కావాలన్నారు. దివ్యాంగులు నడవలేని స్థితిలో ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక వాహనాల్లో శిబిరాలకు తరలించాలని సూ చించారు. దివ్యాంగులకు సదరం శిబిరాల ఉపయోగాలపై న్యాయ సేవాధికార సంస్థ అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, ఉప సూపరిండెంట్ చీకోటి సంతోష్‌కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

## అడవి పదిరకు రాకపోకలు బంద్

వీర్నపల్లి, జూన్ 19: అడవిపదిర గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డాం వాగుపై రూ.2.50కోట్లతో వంతెన నిర్మాణానికి గత బీఆర్‌ఎస్ సర్కారు నిధులు మంజూరు చేయగా, కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టాడు. అయితే వంతెన పూర్తయ్యేదాకా రాకపోకల కోసం వంతెన పక్కన ఓ రైతుకు చెందిన వ్యవసాయ పొలంతోపాటు వాగులో నుంచి తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. అయితే చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు నిర్మాణ పనులు పిల్లర్ల వరకే చేపట్టి మధ్యలోనే వదిలిపెట్టి వెళ్లారు. అయితే పనులు ముందుకు సాగకపోవడం, పొలంలో నుంచి రోడ్డు వేయడంతో సదరు రైతు గురువారం రోడ్డును తొలగించాడు. తన పొలమేకాదు వాగులోని మట్టిని కూడా తీసేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ముక్తార్ పాషా అక్కడికి చేరుకొని పరిశీలించారు. రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వేములవాడలో పూర్తయిన కూల్చివేతలు!



వేములవాడ ప్రధాన రహదారి విస్తరణలో ఇరువైపులా పేరుకపోయిన శిథిలాలు

వేములవాడ, జూన్ 19: వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా కూల్చివేతలు పూర్తయ్యాయి.గత ఆదివారం కూల్చివేతలను ప్రారంభించిన అధికారులు ముందుగా మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన మటన్ మార్కెట్ సముదాయాన్ని కూల్చివేసిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి బుధవారం వరకు మొత్తం ప్రధాన రహదారిలో కోర్టు పరిధిలో ఉన్న భవనాలు మినహా, దాదాపుగా మిగితా 150 పైగా దుకాణాలు, నివాసాలు అధికారులు తొలగించారు. భారీ వాహనాలతో నివాసాలను కూల్చివేయడంతో విస్తరణకు మించి భవనాలు చెడిపోతుండడంతో కొందరు యజమానులు మిగిలిన భాగాలను తొలగించుకుంటామని అధికారులకు కోరడంతో అనుమతించారు. అయితే భారీగా భవనాలను తొలగించడంతో ప్రదాన రహదారికి ఇరువైపులా శిధిలాలు మిగిలిపోయి ఉన్నాయి. అయితే రెండు, మూడు రోజుల తర్వాత శిథిలాల తొలగింపును చేపట్టనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

## ఈఎంఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ తొలగింపు

- మరిమడ్ల ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు
- సిబ్బంది తొలగింపుపై సీరియస్
- మూడోరోజు కొనసాగిన సిబ్బంది నిరసన

ఎల్లారెడ్డిపేట, జూన్ 9: దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ మంజీత్ పాఠశాల నిర్వహణ లోపాన్ని గుర్తించి విధుల్లోంచి తప్పించినట్లు టీజీ ఈఎంఆర్‌ఎస్ సొసైటీ సెక్రటరీ సీతామహాలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జారీ చేసిన ఉత్తర్వుల వివరాల ప్రకారం, ప్రిన్సిపాల్ తన విధులను నిర్వహించడంలో వైఫల్యం చెందాడని పేర్కొన్నారు. పాఠశాలలో విధుల్లో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ 12 మందిలో ఇద్దరిని తీసుకుని పది మంది తొలగింపులో ఎలాంటి నిబంధనలు పాటించలేదని పేర్కొన్నారు. అందుకు సంబంధించి ఇది వరకే సెక్రటరీ నుంచి ఉత్తర్వులు వచ్చే వరకు నూతన సిబ్బంది నియామకం చేపట్టవద్దని పేర్కొన్నా అనుసరించలేక పోయారని తెలిపారు. సిబ్బందిని, విద్యార్థులను సమన్వయం చేయడంలోనూ వైఫల్యం ప్రిన్సిపాల్ ఉందన్నారు. విధుల్లో అశ్రద్ధ చూపినట్లు, పాఠశాల వ్యవహారాల్లో బయట వ్యక్తుల జోక్యం ఉందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీని కారణంగా ప్రిన్సిపాల్ మంజీత్‌ను విధుల నుంచి తప్పించి మరిమడ్ల ఈఎంఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ రామ్‌సూరత్ యాదవ్‌కు బాధ్యతలు అప్పగించారు. కాగా నాన్ టీచింగ్ స్టాఫ్ ఏఎన్‌ఎం సుజాత, ల్యాబ్ అసిస్టెంట్ నిర్మల, వంట మనిషి బాలు మూడో రోజు పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. తమను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని అధికారులను కోరారు.

## స్థానిక ఎన్నికల్లో లబ్ధికి కాంగ్రెస్ జిమ్మిక్కులు

- రైతు బంధు మాజీ మండలాధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ముస్తాబాద్, జూన్ 19 : ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా అమలు చేయక ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తొలగించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని రైతు బంధు మాజీ మండలాధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్ రావు ఆరోపించారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం పార్టీ శ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా ఉండడంతో కేంద్ర రాష్ట్ర నిధులు రాక గ్రా మాల్లో పారిశుధ్యం, వీధి లైట్లు గ్రామాలభివృద్ధి సంక్షే మ కార్యక్రమాల నిర్వహణ అగమ్యగోచరంగా తయారైందన్నారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ మొక్కలు నాటే కార్యక్రమంపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదన్నారు. రైతులందరికీ రైతు భరోసా వేస్తున్నామని చెప్పిన ప్రభుత్వం గత రెండు పంటల్లో ఎందుకు వేయలేదన్నారు. ఆ డబ్బులు ఎగ్గొట్టిందని, ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందన్నారు. ఇచ్చిన హామీలు నామమాత్రంగా అమలు చేస్తు ప్రజలను దృష్టిని మళ్లించేందుకు నామామాత్రపు హామీలు అమలు చేస్తూ స్థానిక ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు జిమ్మికులు చేస్తుందన్నారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, ఉమ్మడి జిల్లా జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్‌పాషా, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, బీసి జాతీయ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీలం స్వామి, మాజీ సర్పంచులు నల్ల నర్సయ్య, జ్యోతి ఎల్లం, నాయకులు కొమ్మెట రా యమల్లు, భరత్, శ్రీనివాస్, జహంగీర్, కుర్ర సావిత్రి, వంగరి దిలీప్, నాయకులు పాల్గొన్నారు.

## రాజన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు

వేములవాడ/వేములవాడ టౌన్, జూన్ 19: రాజన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వేములవాడ రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కూరగాయల శ్రీనివాస్ అన్నారు. గురువారం యాదగిరిగుట్టలో జరిగిన రాష్ట్ర దేవాలయాల జేఏసీ ఉద్యోగుల సమావేశానికి హాజరైన టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌కు వినతి పత్రం అందజేసి కోరారు. అర్చక సిబ్బంది టైం స్కేల్, ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబ సభ్యుల ఆరోగ్యరీత్యా ఉద్యోగులను మాతృ సంస్థలకు బదిలీ చేయాలని కోరారు. రాజన్న ఆలయంలో 14మంది పర్యవేక్షకులకు ఆరుగురు మాత్రమే మిగిలారని ఇతర ఆలయాలకు బదిలీ అయిన వారిని మాతృ సంస్థకు పంపాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు కిషన్ చంద్, పలువురు ఉద్యోగులున్నారు.

## 'ఇసుకాసురుల' ఆగడాలు

- అసోయేషన్ పేరిట వసూళ్లు
- సర్కారు ఆదాయానికి గండి
- పెద్దోళ్లను వదిలి పేదోళ్లను పట్టి పీడిస్తున్న యూనియన్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 19: మండలంలో పేద, మధ్య తరగతి వర్గాలకు అందనంత తీరున ఇసుక ధరలు పెంచడం వెనుక అసోసియేషన్ ఆగడాలే కారణమని ట్రాక్టర్ యజమానులు వాపోతున్నారు. గతంలో వెంకటాపూర్, రాగట్లపల్లి, నారాయణపూర్ నుంచి ఇసుకను తరలించే సమయంలో ట్రిప్పుకు రూ.15 వందల నుంచి 22 వందల వరకు మాత్రమే ఉన్న ధర అమాంతం రూ.3వేల నుంచి రూ.4వేల వరకు పెంచడం వెనుక మతలబుపై ట్రాక్టర్ యజమానులు కొందరు విస్తుపోయే విషయాలు చెబుతున్నారు. ఇటీవల పదిరకు ఇసుక రీచ్‌ను అధికారికంగా ప్రకటించడంతో కొందరు నాయకులు సంపాదన మార్గంగా ఓ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఒక్కో ట్రాక్టర్ ముందు అసోసియేషన్‌లో నమోదు చేయించుకోవాలి అది ఎవరు నడుపుతున్నారో వారి పేరుమీద ఉండాలి లేకపోతే ఒక్కొక్కరికి రూ.50వేలు చెల్లించాలని వసూలు చేశారు. నమోదు చేయించుకున్న వ్యక్తి ట్రాక్టర్‌ను తన పేరిట ఆరు నెలల్లోపు పేరు మార్పిడి చేసుకోవాలి. దీంతో డబ్బులున్న వారు రెండు నుంచి మూడు ట్రాక్టర్‌లు కొనుగోలు చేసుకుని ఇసుక వ్యాపారం చేస్తున్నారు. డబ్బుల్లేని వారు ట్రాక్టర్ లీజ్‌కు తీసుకుంటే అతని వద్ద రూ.50 వేలు ఇవ్వాలని లేక పోతే వాగులో ఇసుక తీయవద్దని నిబంధన పెట్టారు. అలాగే ఇసుక తీయడానికి అనుమతించిన రోజు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.4వందలు వసూలు చేస్తున్నారు. సుమారు 50 ట్రాక్టర్‌లు నడిస్తే రూ.20వేలు వసూలు చేస్తుండగా కొందరు వసూలుపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో ఓ ట్రాక్టర్ యజమాని రూ.4వందలు కట్టకపోతే అధికారులకు చెప్పి సదరు నాయకులు సీజ్ చేయించి జరిమానా వసూలు చేయించారని ఆవేదనగా తెలిపాడు. ఇసుక అనుమతి 2వందల ట్రిప్పులకు చలానా కట్టాలని యూనియన్ నాయకులు తామే తీసుకుని చలానా కేవలం కొద్ది ట్రిప్పులకు కట్టి మిగతాది స్వాహా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండిపడుతుందని ప్రభుత్వానికి చలానా చెల్లిస్తే తమకు అభ్యంతరం లేదని అంటున్నారు. ఇటీవల ఓ ట్రాక్టర్ యజమాని నాలుగు చలానాలకు డబ్బులిస్తే రెండే టోకెన్‌లు ఇచ్చారని మిగతా రెండు ఇవ్వలేదని వాపోయారు. ఎలాగైనా ఇసుక వ్యాపారంపై పెత్తనం చెలాయించే నాయకులను, అందుకు సహకరించే అధికారులను నియంత్రించాలని పదిర గ్రామస్తులు కోరుతున్నారు.

## బాధిత కుటుంబాలకు కొండూరి పరామర్శ



సింగిల్ విండో మాజీ చైర్మన్‌ను పరామర్శిస్తున్న కొండూరి

గంభీరావుపేట, జూన్ 19: మండలంలోని ఆయా గ్రామాల్లో బాధిత కుటుంబాలను గురువారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. కొత్తపల్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ నాగపురి బాలరాజుగౌడ్ తల్లి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను కొండూరి పరామర్షించారు. కొత్తపల్లిలో నాగపురి లక్ష్మీనారాయణగౌడ్, సముద్రలింగాపూర్‌లో బిజిలి మల్లేశంలు మృతి చెందగా వారి కుటుంబాలను కొండూరి పరామర్శించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, నేతలు వంగ సురేందర్‌రెడ్డి, గౌసొద్దీన్, సలీం, చెవుల మల్లేశం తదితరులున్నారు.

## కోడెలను నిత్యం పర్యవేక్షించాలి

కలెక్టరేట్, జూన్ 19 : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన రెండు గోశాలలోని కోడెలను నూతనంగా ఎంపిక చేసిన సిబ్బంది వాటిని నిత్యం పర్యవేక్షిస్తూ, సంరక్షించాలని జిల్లా పశు వైద్యాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాల, ఆలయానికి సమీపంలోని కట్టకింద గోశాలలో పనిచేసేందుకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారిలో నుంచి పలువురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కోడెలు, ఆవుల సంరక్షణపై వివరించారు.

## ప్రతిరోజూ యోగా సాధనతో ఆరోగ్యం

కలెక్టరేట్, జూన్ 19 : నిత్యం యోగా సాధనతో ఆరోగ్యంగా ఉంటారని ఆయుష్ యునాని డిస్పెన్సరీ యోగా శిక్షకులు బీ శ్రీనివాస్, టీ స్వప్న పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఉదయం కామన్ యోగా ప్రోటోకాల్‌పై జిల్లా అధికారులు, సిబ్బందికి ఆయుష్ యునాని డిస్పెన్సరీ యోగా శిక్షకులు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యోగాసనాలు, ప్రాణాయామం ముద్రలు, ధ్యానం తదితర అంశాలపై వివరిస్తూ చేయించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది, కలెక్టరేట్ కార్యాలయ ఏవో రామ్‌రెడ్డి, ఆయుష్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శశిప్రభ, డాక్టర్ సౌమిని, డాక్టర్ శ్వేత, డాక్టర్ స్వరూప, డాక్టర్ కల్యాణి, డీపీఎం తిరుపతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎరువులు దుకాణాల్లో తనిఖీలు

ముస్తాబాద్, జూన్ 19 : రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించినా రసీదులు ఇవ్వాలని టాస్క్ ఫోర్స్ బృందం అధికారులు దుకాణ యాజమానులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల దుకాణాలను గురువారం టాస్క్‌ఫోర్స్ టీమ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. వానకాలం పంటలు ప్రారంభమైన నేపథ్యంలో, మండలంలోని వివిధ విత్తనాలు, ఎరువులు పురుగుమందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు, ఎస్ ఐ గణేష్, తంగళపల్లి మండల వ్యవసాయ అధికారి సంజీవ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

## రాజన్న నిత్యాన్నదానసత్రానికి దాతల విరాళం

వేములవాడ టౌన్, జూన్ 19 : వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారి నిత్యాన్నదాన సత్రానికి గురువారం ఇద్దరు దాతలు రెండు లక్షల విరాళాలు ఆలయ అధికారులకు అందజేశారు. న్యూఢిల్లీలో ఉన్న బోయినపల్లి వాస్తవ్యుడు పీచర శ్రీహర్ష లక్ష రూపాయలు, సుప్రీంకోర్టు అడ్వొకేట్ కృష్ణ లక్ష రూపాయల విరాళాలు ఏఈవో శ్రవణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

## ఆర్టీఏ అధికారుల తనిఖీలు

వీర్నపల్లి, జూన్ 19: సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా తిరుగుతున్న మూడు ట్రాక్టర్లను రవాణా శాఖ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఏఎంవీఐ రజినీదేవి ఆధ్వర్యంలో వీర్నపల్లి మండలంలో తనిఖీలు నిర్వహించారు. మూడు ట్రాక్టర్లు, ఒక పికప్ వాహనాన్ని ఆపి సోదాలు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో ఆ వాహనాలు పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసులు నమోదు చేశారు.

## పుస్తక పఠనంతో జ్ఞాపకశక్తి

వేములవాడ, జూన్ 19: పుస్తక పఠనం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని హెచ్ఎం వికృతి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం జాతీయ పుస్తక పఠన దినోత్సవం సందర్భంగా న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో పుస్తక పఠన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పుస్తక పఠనం ఎంతో అవసరమని దాని ద్వారా జ్ఞాపకశక్తి పెరగడమే కాకుండా సరియైన ఉచ్చారణ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ అంగన్‌వాడీ ఉపాధ్యాయులు లిక్కిడి మంజుల, విద్యార్థులున్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన కారు

- బైక్ పైఉన్న చింతలఠాణా టిప్పర్ డ్రైవర్ దుర్మరణం
- చింతలఠాణాలో విషాదం



కుర్మ నరేశ్(ఫైల్)

సిరిసిల్ల రూరల్, జూన్ 19: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో సిరిసిల్ల–సిద్దిపేట రహదారిపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో కారు బైక్‌ను ఢీకొట్టగా, వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే, వేములవాడ మండలం చింతలఠాణా (ఆర్‌అండ్‌ఆర్ కాలనీ)కి చెందిన కుర్మ నరేశ్ (38) రైల్వేలైన్ పనుల్లో టిప్పర్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. సిరిసిల్ల–సిద్దిపేట మధ్య జరుగుతున్న రైల్వే పనుల నేపథ్యంలో సిద్దిపేట జిల్లా విఠలాపురంలో రైల్వే పనుల్లో టిప్పర్ వాహన డ్రైవర్‌గా నరేశ్, రోజూ తన బైక్‌పై వెళ్లి, వస్తుంటాడు. బైక్‌పై విఠలాపురంలో జరుగుతున్న రైల్వే పనులకు వెళ్తుండగా, తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చేరుకోగానే , కారు అతివేగంతో వచ్చి బైక్‌ను ఢీకొట్టంతో బైక్ పల్టీలు కొట్టి, కొద్ది దూరం పడిపోయింది. ఈ ప్రమాదంలో నరేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో నరేశ్‌ను సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. ప్రమాద ఘటన స్థలంలో కారులో నలుగురు ఉన్నారని, వారిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మృతుడు నరేశ్‌కు భార్య మమత, ముగ్గురు కూతుర్లున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, ప్రమాద ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా, అతివేగంతో బైక్‌ను ఢీకొట్టడంపై ప్రశ్నిస్తే, కారులో ఓ మైనర్ బాలుడు తాను అవసరమయితే పదేళ్లు జైలుకెళ్తానంటూ స్థానికులపై దురుసుగా ప్రవర్తించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి

వీర్నపల్లి, జూన్19: పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు మల్లారపు అరుణ్ కుమార్, జాలపెల్లి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండల వ్యాప్తంగా 60 సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, నిరుపేద రైతులు పోడు వ్యవసాయం చేసుకుంటున్న భూముల్లో ఫారెస్ట్ అధికారులు ప్లాంటేషన్ చేపట్టడం సరికాదన్నారు. ప్లాంటేషన్ పనులు ఆపివేసి సాగు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఆయా గ్రామాల్లో పోడు రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల పోడు రైతులకు మద్దతుగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

## ఆటో బోల్తా పలువురికి గాయాలు

ముస్తాబాద్, జూన్ 19 ముస్తాబాద్ మండలం మద్దికుంట మోహినికుంట గ్రామాల శివారులో గురువారం ఆటో బోల్తా పడి పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తులు ముస్తాబాద్ నుంచి దుబ్బాకకు వెళుతున్నారు. మోహినికుంట గ్రామ శివారులో కుక్క అడ్డు రావడంతో దానిని తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడగా ఆరుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడ్డ వారిని సిద్దిపేట దవాఖానకు తరలించారు.